1984 దీపావళి కథల పోటీలో రు. 650/- బహుమతి పొందిన కథ

# నేనేం చెయ్యనే, చెప్పవే అమ్మా!



"అమ్మా అమ్మా, వీపు మీద విత్మంగా కొట్టిందే!" కంగారుగా వంటింట్లోకి పరుగెత్తుకొస్తూ అన్నాడు ఉద్దండు. 'విత్మంగా' అన్నది వాడి స్వంత భాష.

కూరకు పోపు పెడుతూన్న శకుంతల వెనక్కి తిరక్కుండానే విసుగ్గా అంది:

"ఎవరూ, ఎదురింటి తాయారేనా!" అయిదేళ్ల వెధవ్వి, ఆడ పిల్లల్తో ఆడొద్దురా అంటే వినవు! ఇప్పుడా పిల్లొచ్చి నీమీద నేరం చెబుతుంది నేనేం చావను! వచ్చి ఈ పీట మీద చావు! ఈ గదిలోంచి కదిలావంటే చూడు, గరిటె కాల్చి వాత పెడతా!" – కుడిచేతిలో గరిటె ఉండగానే ఎడం చేత్తో పీట ఎత్తి గోడ వారగా పడేసింది కొడుకు వైపు చూసింది

ఉద్దండు చేతులు వెనక్కు కట్టుకుని తల్లి వైపు తీక్షణంగా చూస్తూ నుంచునున్నాడు తాపీగా అన్నాడు "తాయారు కాదు"

"అప్పాయమ్మ కూతురా?"

"కాదు!"

"సావిత్రా?"

"కాదు!"

"ఇంకెవ్వరూ, చెప్పి చావు!"

"అదిగో అది!" – ఉద్దండు వెనక్కి తిరిగి చేత్తో వాకిలి గదిలో ఉన్న కరెంటు స్విచ్ బోర్డు వైపు చూపించాడు

శకుంతల చూసింది ప్లగ్ పెట్టే కన్నాల్లో ఒక దాంట్లో తోటకూర కాడొకటి దూర్చుంది బోర్డు కింద ఇనప కుర్చీ వేసుంది

శకుంతల కంగారు పడింది "అదెక్కి ఆ కాడ గుచ్చావా?" – ఆతృతగా అడిగింది

ఊఁ! ఎందుక్కొట్టిందసలు?"

భయమూ, చిరాకూ, కోపమూ ఒక్కుమ్మడిగా శకుంతల మొహంలో కలగలిసి పోయాయి ఉవ్వెత్తుగా లేచిన ఆవేశంతో పిల్లాడి రెక్క దొరకబుచ్చుకుని వీపు మీద దబ దబా బాదుతూ ఆవేశాన్ని కక్కేసింది "త్రాష్టుడా, అయోమయం వెధవా!

బలవంతం చావు చద్దామని ఉందేమిట్రా! చెడబుట్టావురా సన్నాసీ! ఆ చచ్చినాళ్లని చంపుకున్నాననే పేరుకే కుమిలి కుమిలి చస్తూంటే నువ్వు కూడా చచ్చి నాకు బతుకు లేకుండా చేస్తావురా!ముదనష్టం వెధవా, ఏడు, ఏడు వెధవా?"

నాలు గైదు బాదులు బాదేప్పటికి శకుంతలకి ఛాలొచ్చేసింది ఆమె వెనక్కి గోడకి కూలబడి పోయింది మరుక్షణంలో వెక్కి వెక్కి ఏడవ సాగింది!

పిల్లాడు గట్టి పిండం ఈ దెబ్బలకి తట్టుకో గలిగాడు కాని బెదిరిపోయాడు పౌరుషంగా చూస్తూ ఏడ్చుకుంటూ వీధిలోకి పరుగెత్తాడు

పధి నిముషాలకి, తన ఆవేశం తగ్గగా, శకుంతల చటుక్కున లేచింది మెయిన్ స్విచ్ దించేసింది పొడి చీరతో కాళ్ళి తోటకూర కాడని కిందికి పడేసింది కుర్చీ ఎత్తేసింది హఠాత్తుగా ఆమెకి పిల్లాడు జ్ఞాపకం వచ్చాడు "బాబూ, నాన్నా బాబూ!" అంటూ వాకిట్లోకి పరిగెత్తింది వీధిలోకి అటూ ఇటూ చూసింది వాడు లేడు ఇంటి వాళ్ల వాటా లోకి తొంగి చూసింది అది తాళం పెట్టుంది చటుక్కున ఇంటి వాళ్ల సందులో కెళ్ళి జామ చెట్టు మీదికి చూసింది లేడు! అట్నుంచటే దొడ్లో కొచ్చింది నూతి పళ్లెంమీద కూర్చుని రెండు పిల్లి పిల్లలు మందార చెట్టు కిందికి తొంగి చూస్తున్నాయి శకుంతల కూడా అటే చూసింది వాడున్నాడు! ఆ చెట్టు గుబురులో ఇంకో రెండు పిల్లి పిల్లల్తో ఆడుతూ, అవి ఏ కొమ్మ మీంచి దూకి ఎటు వైపు వెడితే వీడు అట్లాగే ఆ కొమ్మమీంచే దూకుతూ వాటి వెనకాలే వెళ్ళి వాటిని పట్టుకోవాలని చూస్తున్నాడు

ఆ మందార చెట్టూ, దాని గుబురు కింద నీడ, అక్కడ తిరిగే పిల్లి పిల్లలూ, అక్కడ రాలే కొబ్బరి పిందెలూ, అక్కడ గడ్డిలో తడి తగిలేస్తే పేలే చిటపట కాయలూ – ఇవ్వి వాడికి ప్రాణంలో ప్రాణం! తన ఆనందాల్నీ, ఆవేదనల్నీ వాడు అక్కడే వాటితోనే పంచుకుంటూంటాడు

శకుంతల దీర్ఘంగా నిట్టూర్చింది ఆమెలోని ఆదుర్దా ఒక్కసారిగా దిగిపోయింది కానీ మరుక్షణం ఆమె చటుక్కున గుబురులోకి వంగి వాణ్ణి ఇవతలకి తీసి తన గుండెలకి హత్తుకుంది మళ్ళీ గుడ్ల నీరు కుక్కుకుంది ఆవేశంగా అంది రాక్షసిని! దయ్యాన్ని! పాపిష్ఠిదాన్ని! నా నోరు పడిపోను! నా చేతులు కాలిపోను! దిక్కుమాలిన బతుకైపోయింది! నిన్నింకెప్పుడూ కొట్టన్లేరా నాన్నా! తప్పుకాదూ, ప్లగ్‌లో వేళ్ళు పెట్టచ్చా! అది ప్రమాదం బాబూ! పెట్టకూడదు ఇంకెప్పుడూ పెట్టకే"

పిల్లాడు, అట్లాగేలేవే!' అన్నాడు వాడి దృష్టి అంతా నూతి గట్టు మీదున్న నాలుగు పిల్లి పిల్లల మీదుంది 'చేతనైతే పట్టుకోమన్నట్టు తోకాడిస్తూ అవి వీణ్ణి ఊరిస్తున్నాయి వాడు చటుక్కున తల్లి ఒళ్లోంచి దూకి గుబురు కింద నించి దూకి వెళ్ళి



వాటిని పట్టుకోబోయాడు అవి ఇంటి వాళ్ల సందులోకి పారిపోయాయి వాడు వాటి వెనకాల పడ్డాడు

శకుంతల ఇవతల కొచ్చింది మళ్ళీ దీర్ఘంగా నిట్టూర్చింది వండిన కూర వాసన హెచ్చరించగా ఆమె గబగబా వంటింట్లోకి నడిచింది

* * *

"గేదెయమరం పక్కన కొత్తగా కాన్వెంటు పెట్టార్ట మన బాబుని ఎల్ కే జీ క్లాసులో చేర్పిస్తే పోలా?" అన్నాడు ధీమంతరావు భోజనానికి కూర్చుంటూ

అన్నం వడ్డిస్తూన్న శకుంతల, భర్త మాటలికి తలెత్తి చూసింది అంది "కే జి క్లాసా టన్ను క్లాసా ఏమీ అక్కర్లేదు నా పిల్లాణ్ని నా కళ్ళ ముందు తిరగనీండి "

"అది కాదోయ్, ఇప్పట్నుంచీ జులాయిగా తిరగటం అలవాటయిపోతే చదువంటదు గదా! నోట్లో నాలుగు ముక్కలుంటేనేగదా, బతుకు తెరువు!"

"మనబ్బాయికి చదువు రాదని బెంగగా ఉందా! నిక్షేపంగా వస్తుంది! పోనీ రాదు ఇప్పుడేంటట? ఇంజనీర్లూ, డాక్టర్లేనా లోకంలో బతుకుతున్నది? మీకేం డిగ్రీలున్నాయని రెండు పూటలా తిన గలుగుతున్నారు? • చీకూ చింతా లేకుండా హాయిగా ఆడుతూ పాడుతూ తిరిగే వయస్సు వాడి కిది దిక్కుమాలిన కే జి పేరుతో ఇప్పట్నుంచీ వాణ్ణి బిగింపుల్లో పెడతారా? అందేం కుదర్దు!"

"అసలు విషయం అది కాదోయ్ నువ్వు వాడితో సతమత మవుతున్నట్టున్నావు గదా! అందుకని!"

"ఎంత సతమతమయినా తల్లికి పిల్లాడు భారమవుతాడా? అసలయినా, కొంపు లెక్కువయి మీరీ మధ్య పొద్దున పోయి రాత్రి కొస్తున్నారు మరి నాకు కాలక్షేపం ఏమిటి? వీల్లేదు! ససేమిరా ఒప్పుకోను!"

## మతం

మనసు మనసుల మధ్య
మాయ పొరలు కమ్మించి
మనిషి మనిషికి మధ్య
మంటలు రగిలించి
మానవత్వంలో
దానవత్వం సృష్టించి
దేశాన్ని సహితం
దహించే
దావానల జ్వాల....

—ఎస్. మొగలయ్య సాగర్

## నేనేం చెయ్యనే, చెప్పవే అమ్మా!

ధీమంతరావు నవ్వాడు "సరే, నీ ఇష్టం!" అన్నాడు

* * *

మధ్యాహ్నం వేళ నిద్రపోతున్న శకుంతలకి దాహం వేసి మెలకువ వచ్చింది వంటింట్లో కొచ్చి మంచి నీళ్లు తాగుతుండగా దొడ్లోనించి ఉద్దండు మాటలు వినిపించాయి మధ్య మధ్య అవిచి పెడుతున్న ఏడుపు ఎక్కిళ్ల రూపంలో బయట కొస్తోంది "వెధవ పిల్లి! దొంగ పిల్లి! రౌడీ పిల్లి! భూకంపం పిల్లి! నిన్ను తన్నేస్తానేవ్! "

శకుంతల చటుక్కున తలుపు తీసి చూసింది చేతిలో గారెతో ఉద్దండు నూతి గట్టు మీద కూర్చునున్నాడు వాడి కుడి బుగ్గమీద సన్నగా గాటుంది రక్తంతో ఆ గాటు ఎర్రబడింది

శకుంతల కంగారుగా వెళ్ళి "ఏమైంది నాన్నా ఆ గాటేమిటి?" అంది

"అదుగో అక్కడ దజ్జాగా కూర్చుందే, ఆ తెల్ల పిల్లి గీరేసింది " ('దజ్జాగా' అనేది వాడి స్వంత భాష)

"ఎందుకు గీరింది?"

"ఆకలేసిందిగా! వాళ్లమ్మ లేదు! అందుకని ఏడ్చింది అందుకని దాని నోట్లో గారె అప్పుచ్చి పెట్టానుగా! ఎందుకు గీరిందమ్మా?"

"గారె ఎక్కడిది?"

తాతయ్య గారింటోది నేనే తెచ్చాగా"

"చెప్పకుండా తెచ్చావా! తప్పు కదూ!"

ఉద్దండు బిక్క మొహం పెట్టాడు

"ఛీ, వెళ్ళి వాళ్ళింట్లో పెట్టేసిరా ఛీ!"

ఉద్దండు లేచి ఇంటి వాళ్ల వంటింటి గుమ్మం వైపు నాలుగడుగు లేసాడు ఇంటాయన తలుపు తెరిచాడు నవ్వుతూ అన్నాడు "గారె తీసి కెళ్ళావా! నిన్ను తాడుతో కట్టేస్తానుండు!"

ఉద్దండు నిలబడి పోయాడు పౌరుషంగా అన్నాడు "నాకోసం కాదు మా అమ్మ పాలు ఎక్కడో పెట్టింది పిల్లికి ఆకలేస్తే గారెట్టాను ఎందుకు తిన్లేదు? గీరేసింది, ఇదిగో ఇక్కడా, ఇక్కడా! దొంగ పిల్లి! దాన్ని కట్టెయ్యండి!"

'పోన్లే నువ్వు తినెయ్ ఆ గారె

"తినను దాన్ని కట్టెయ్యండి ముందర!"

ముసలాయన నవ్వాడు "అదీ నీలాంటిదే రౌడీది!"

ఉద్దండులో పౌరుషమూ, కోపమూ కల గలిసి పోయాయి మొహం ఎర్రబడి పోయింది గారెని విస్సిరి నేలకేసి కొట్టాడు, అరిచాడు "నేను రౌడీని కాదు అదే రౌడీ! మీరే రౌడీ!"

చటుక్కున శకుంతల అంది "ఆఁయ్, అమ్మా! తాతగార్ని అనకూడదు! ఇంట్లోకి రా, మందు రాస్తాను ఇంకా నయం, కన్ను పోవాల్సింది, లేచిన వేళ మంచిది!" – చెయ్యి పట్టుకుని లాగబోయింది

"రాను! రౌడీ తాతగారు! రౌడీ తాతగారు!" – గట్టిగా అరిచాడు కదల్లేదు, మొరాయించాడు, ఉద్దండు


శకుంతల వాడి వీపు మీద ఒక్క చరుపు చరిచింది వాడు బావురు మన్నాడు

ముసలాయన, "అరెరె, ఎందు క్కొట్టావమ్మా! తొందర పడ్డావు! వాడిది నిష్కల్మషమైన మనస్సు! దాన్ని అర్థం చేసుకోవల్సింది మనం!" అన్నాడు

"లేకపోతే ఏం చెయ్యనండీ బాబాయిగారూ, మరీ లక్ష్యం లేకుండా పోతోంది ఇప్పుడీ పిచ్చి కూతలేంటి చెప్పండి! ఇట్లాంటివి రోజుకు ఎన్నో! అబ్బబ్బ ప్రాణం పిండేస్తున్నాడు!" – ఈ మాట పూర్తయ్యేలోపలే శకుంతలకి దుఃఖం పొర్లొచ్చింది పిల్లాణ్ని ఎత్తుకుని గుండెల కదుముకుంటూ పరుగెత్తుకుంటూ లోపలి కెళ్ళి పోయి తలుపేసుకుంది!

* * *

శకుంతల రోజూ పొద్దున్నే పిల్లాడికి నీళ్ళు పోసాక బట్టలు తొడిగి దేవుడి పటాల ముందు నుంచో బెట్టి నమస్కారం పెట్టిస్తుంది



- ఓ ఆదివారం మధ్యాహ్నం ఉద్దండు హడావిడిగా వచ్చాడు. వంటింట్లో బజ్జీలు వండుతున్న తల్లి దగ్గరికి చేతులు వెనక్కి కట్టుకుని, ధీమాగా నుంచొని తీక్షణంగా అడిగాడు "నిజంగా ఆంజనేయులికి తోకుంటుందామ్మా?"

"తోకా? ఉంటుందమ్మా" అంది శకుంతల

వాడు వాకిలి గది దగ్గర కెళ్ళాడు మెల్లిగా ధీమంతరావూ, అతని స్నేహితుడూ ఎదు రెదురుగా గాడ్రెజ్ కుర్చీలో కూర్చుని మాట్లాడుకుంటున్నారు ఆ స్నేహితుడు కట్టుకొచ్చింది పంచె, లాల్చీ

ఉద్దండు వెళ్ళి, చేతులు వెనక్కు కట్టుకుని, మధ్య గుమ్మంలో నుంచున్నాడు ఆ స్నేహితుణ్ణి పరిశీలనగా చూసాడు చూసి, చూసి, కదిలి, వాళ్ళిద్దరి మధ్య నించీ వెళ్ళి, అవతలి వైపున్న వీధి గుమ్మంలో నుంచున్నాడు అక్కడ్నుంచి పరిశీలించాడు సందులో కెళ్ళారు కిటికీ పక్కన్నుంచుని లోపలికి చూసాడు అట్లా కూడా లాభం లేదనుకున్నట్టున్నాడు మళ్ళీ గదిలో కొచ్చేసాడు ఆ స్నేహితుడి కుర్చీ వెనకాలే అటూ ఇటూ తారట్లాడటం మొదలెట్టాడు

అప్పటికి వాడు, తన తండ్రి దృష్టిలో పడ్డాడు

ధీమంతరావడిగాడు: "ఏమిట్రా నాన్నా, చూస్తున్నావు?"

చేతులు వెనక్కు కట్టుకు నుంచునే అన్నాడు ఉద్దండు "తోక'

"ఏంటీ?"

"తోక!"

ధీమంతరావు తికమక పడ్డాడు అన్నాడు "తోకా! తోక పెట్టుకుని ఆడుకున్నావా! ఇక్కడెక్కడా పడలేదే! సందులో పడేసుకున్నావేమో!"

ఆ స్నేహితుడు ఉద్దండు వైపు తిరిగి ప్రసన్నంగా ఇకిలించాడు (నవ్వాడు)

ఉద్దండు ఒక చేతి వేల్తో ఆ స్నేహితుణ్ణి చూపిస్తూ "ఈయన తోక!" అన్నాడు

ఆ స్నేహితుడు ఉలిక్కి పడ్డాడు చటుక్కున లేచి నుంచుని గోచీ సర్దుకున్నాడు ఉద్దండు కిందికి వంగి మరీ చూట్టం మొదలు పెట్టాడు అతను మరీ కంగారుగా అటూ ఇటూ చూస్తున్నాడు

ప్లేట్లల్లో బజ్జీలు తెచ్చిన శకుంతల, "ఏమిట్రా అది!" అంది

"ఈయన్ది, తోక!" అన్నాడు ఉద్దండు

శకుంతలకి అర్థమయింది "ఛ, తప్పు! అట్లా అనకూడదు లోపలికి రా" అంది

"ఉహుఁ, తోక చూడాల్సిందే!"

"చెప్తుంటే నీక్కాదూ, వస్తావా రావా!" – శకుంతల చటుక్కున వాణ్ణి దొరక పుచ్చుకుని ఎత్తుకుంది "ఇదేం తిక్కరా వెధవా! ఇందుకా అడిగావు! ఏమనుకోకండి ఆంజనేయు లన్నయ్యగారూ! మా వాడికి ఇదో తిక్కలెండి!"

ఉద్దండు మొహం పౌరుషంతో ఎర్రబడింది తల్లి బుజాలమీద దబ దబాగుద్దుతూ అన్నాడు నీకే తిక్క రౌడీ తిక్క! పిచ్చి తిక్క! పిచ్చి పిచ్చి తిక్క!

శకుంతలకి సహనం చచ్చింది వాడి వీపుమీద ఒక్కటేసింది వాడు బావురు మన్నాడు

పిల్లాణ్ణి భర్త ఒళ్ళో కూర్చో బెట్టి శకుంతల దబ దబా వంటింట్లో కెళ్ళిపోయింది, నోటికి కొంగు అడ్డం పెట్టుకుంటూ!

*　　　*　　　*

పది రోజులు గడిచాయి

విశ్వ హిందూ పరిషత్ సంస్థ వారు కార్తీక మాస సందర్భంగా గోపాదాల రేవు దగ్గరగా గోదావరి ఒడ్డున, పందిరి వేసి, ఉపన్యాసాల కార్యక్రమం ఏర్పాటు చేసారు అవతలి గట్టు నున్న రాజమండ్రి వైపు నుంచి కూడా జనాన్ని ఆకర్షిస్తోంది ఆ కార్యక్రమం పిల్లాణ్ణి తన కూడా తీసి కెళ్ళింది ఒక ఉపన్యాసానికి శకుంతల

ఇంటికి తిరిగొస్తుండగా ఉద్ధండు అడిగాడు "సేవించటమంటే ఏంటి?"

శకుంతల చెప్పింది "అడిగినవన్నీ చేసి పెట్టటం పూజ చెయ్యటం అన్నమాట!"

"మరయితే ముష్టాళ్ళని మనం పూజ్జెయ్యాలా? అదేనా ఆ తాతగారు చెబుతున్నది?"

"అవును మన దేశంలో ఎక్కువ మంది అన్నమూ, బట్టలూ లేనివాళ్ళే కనక వాళ్ళనే దేవుడు అనుకొని సేవించాలి డబ్బులూ, బట్టలూ, అన్నమూ – వాళ్ళకి ఏం కావాలంటే అవ్వి మనం వాళ్ళ కివ్వాలి."

"ఇస్తే?"

"ఇస్తే శివుడు మనకి సాయం చేస్తాడు మనకి జ్వరం వచ్చినప్పుడు పోగొడతాడు "

"ఇవ్వకపోతే?"

"శివుడు మనకి సాయం చెయ్యడు మళ్ళీ మన్ని కుక్కగానో, బల్లిగానో పుట్టిస్తాడు "

"భూకంపం పిల్లా! బాబోయ్!"

ఇంటి కొచ్చా రిద్దరూ

శకుంతల వంటింట్లో ఉండగా వాకిట్లోకి ముష్టి పిల్లాడొచ్చాడు "చలిగా ఉంది బాబూ, చిరుగుల చొక్కా ధర్మం చెయ్యండి బాబూ!" అన్నాడు

ఉద్దండు లోపల్నుంచి తన నడిపాత చొక్కా, గట్టిది, ఒకటి తెచ్చి వాడి కిచ్చాడు వాడు వెళ్ళిపోతుండగా శకుంతల చూసి "ఏమిట్రా అది?" అంది.

ఉద్దండు చెప్పాడు

శకుంతల నోరు నొక్కుకుంది, అంది, "హోర్నీ నీ దానం మండా! గట్టి చొక్కా ఇచ్చుకుంటార్రా ఎవరైనా? నీ కెన్నున్నాయని అదిచ్చావురా! పోనీ నన్నడక్క పోయావా? నీ కీ తిక్క పోలేదన్న మాట!"


పౌరుషంగా అన్నాడు ఉద్దండు "నీ కే తిక్క! ఇవ్వకపోతే దేవుడి క్కోపం వస్తుందన్నావుగా మరి!"

"ఆఁ, ఇచ్చావులే మహా గొప్పదానం!

## విదుర నీతి

చెట్టుకు చీడ పట్టి
శిధిలమై పోతుంటే
విత్తు ముందా చెట్టు ముందా అనే
తర్కం
నీకనవసరం!
సమస్యలు సహస్ర ఫణాలెత్తి
చావగొడుతున్నపుడు
విచక్షణాత్మకమైన
విదుర నీతి అవసరం!!

–పైడిశ్రీ



# నేనేం చెయ్యనే, చెప్పవే అమ్మా !

ఇంకెప్పుడూ చెప్పకుండా చెయ్యకు ఇట్లాంటి త్రాష్టప్పని!'

ఆఁ త్రాష్ట పని త్రాష్ట ప్పని! – గొణుక్కున్నాడు ఉద్దండు!

శకుంతల పచ్చడి నూరటానికి దొడ్లో కెళ్లింది గబ గబా వంటింట్లో కొచ్చాడు ఉద్దండు శివుడి పటం ముందు నుంచున్నాడు చూసి, చూసి దాన్ని తీసి ఎత్తి నేల కేసి కొట్టాడు ఫ్రేముతో సహా అది ముక్క లయింది!

శకుంతల వచ్చి చూసింది అంది హార్ని వెదవా! ఎంత పని చేసావురా! ఇట్లాంటి బుద్ధులు పుడుతున్నాయేంరా నీకు! ఎందుకు చేసా వీ పని!

ముష్టాడిని సేవించానుగా, మరి తిట్టించా డెందుకు? రౌడీ దేవుడు! పిప్పిప్పీ దేవుడు! – ఉద్దండు ఇంకో ఫోటో గోడంచి తియ్యబోయాడు తల్లి అడ్డగించింది వాడు పెనుగులాడాడు అది కింద పడింది, అద్దం ముక్క లయ్యింది

శకుంతల తీక్షణంగా చూసింది వాడ్ని రెండు గుద్దులు గుద్దింది ఏడుస్తూ వాడు వాకిట్లో కెళ్లిపోయాడు

*             *             *

ధీమంతరావుంటున్న వాటా వైపు ప్రహరీ కింద ఖాళీ స్థలం ఉంది కుర్రాళ్లు కొంతమంది రోజూ వచ్చి క్రికెట్ ఆడుకోవటం మొదలెట్టారు ఉద్దండు శ్రద్ధగా వెళ్లి కూర్చుని, ఆ ఆట ఆడే తీరు గమనించాడు

ఓరోజు సాయంత్రం ఉద్దండు స్వంతంగా బౌలింగు ప్రాక్టీసు చెయ్యబోయి మందార చెట్టు వైపు గురి చూసి రాయి విసిరాడు పని మనిషి రాలేదని విసుక్కుంటూ నూతి పళ్లెంలో కూర్చుని ఈసురోమని అంట్లు తోముకుంటోంది, శకుంతల ఆ రాయొచ్చి ఆమె నడి నెత్తిన రపీమని తగిలింది! ప్రాణం అర్ధంటి పోయింది ఆమెకి! కాస్సేపటకి తేరుకుంది దూరంగా బిత్తరపోయి చూస్తూ నుంచునున్న పిల్లాణ్ణి దొరక పుచ్చుకుని, తన సత్తువంతా కూడదీసుకుని దబా దబామని బాదేసింది ఎక్కడ తగిలిందో ఎంత తగిలిందో కూడ చూసే ఓపిక లేక పోయిం దామెకి!

రాత్రికి ధీమంతరావు ఇంటి కొచ్చేసరికి జ్వరం తగిలి ఉద్దండు మగతగా పడున్నాడు భర్తకి ఏదో ఇంత ఉడికించి పెట్టి తానేదో, కతికి, అన్నం తిన్నాననిపించింది, శకుంతల రాత్రి పదయ్యేసరికి నూట మూడు జ్వరంతో ఉద్దండు పొగలూ సెగలూ కక్కుతున్నాడు!

ధీమంతరావు డాక్టర్ని ఎలుచు కొచ్చాడు కణతలూ గవదలూ వాచాయి

ఆటల్లో కొట్టుకున్నట్టున్నారు పిల్లలు కంగారు పడకండి జ్వరం తగ్గటానికి యిస్తున్నాను తగ్గిపోతుంది ఈ రాత్రి గడవ నివ్వండి పొద్దున్నే చూడొచ్చు" అని ఇంజెక్షనిచ్చి వెళ్ళిపోయాడు

మగతలో ఉద్దండు కలవరింతలు మొదలు పెట్టాడు "ఇంకెప్పుడూ విసర్నే, అమ్మా! కొట్టకే, నన్ను కొట్టకే గారె పెడితే ఎందు గ్గిరాలి రౌడీ పిల్లి! ఆంజనేయులికి తోకలేదు నువ్వంతా పిచ్చి మాటలు! ఏమీ చెయ్యద్దంటే నేనేం చెయ్యనే అమ్మా! చెప్పవే! నువ్వే రౌడీ! నువ్వే తిక్క! నన్నేం చెయ్యమంటావే! నేనేం చెయ్యనే, నేనేం చెయ్యనే చెప్పవే! – ఒక రాత్రి వేళ దాకా ఉద్దండు ఇట్లా పలవరిస్తూనే ఉన్నాడు

శకుంతల పిల్లాణ్ణి కావిలించుకొని గుండెలవిసి పోయేలాగా ఏడ్చింది ఏవండీ, ఈ రాత్రి గడవ నివ్వమన్నాడు డాక్టరు అంటే నా బాబు నాకు దక్కడా? ఇక్కడితో ఇహ ఈ ఋణం కూడా తీరిపోయిందా! ఏవండీ నే నిప్పటికే సహం చచ్చున్నానండీ! ఇద్దరు వెధవల్ని మోసీ మోసీ నాలుగేళ్ళూ రేండేళ్ళూ పెంచీ పెంచీ, తీరిగ్గా తీసికెళ్ళి వల్లకాటికి అప్పజెప్పేసానండీ! ఇహ మరి అప్పజెప్పే ఓపిక లేదండీ! ఈ అప్పగింతల్తో మనస్సు గుల్లయింది దాంతో ఒళ్ళు గుల్లయింది! ఈ మూడో నలుసును కూడా ఎగరేసుకు పోతాడా పాపిష్టి దేవుడు? సరే నన్నూ తీసికు వెళ్ళమనండి! డాక్టర్ని తీసుకొచ్చి నా కింజెక్షనిప్పించరూ, బాబుతో బాటు నేనూ పోతాను వాడు లేకపోతే నేను బతకలేనండీ! ప్రతి ముదనష్టం వెధవా అట్టే వచ్చి ఇట్టే ఎగిరి పోతున్నాడు ఒక్కణ్ణి కూడా దక్కించుకోలేని ఈ వెదవ బతుకు ఎందుకండీ, కాల్చనా! పాపిష్టిదాన్ని చేతులారా చావగొట్టుకున్నాను ఈ చేతులమీద వాతలు పెట్టండీ ప్లీజ్! ఏవండీ, కసితో కొట్టలేదండి! ఒంట్లో ఓపిక చస్తోంది వాడి అల్లరి భరించలేక పోతున్నానంతే, నమ్మరూ? నా బాబు నాకు దక్కుతాడా? మామూలుగా తెల్లారుతుందా? నేను లక్ష పత్రి మొక్కుకున్నాను మీరు అభిషేకాలు మొక్కుకోండీ ఏవండీ

ధీమంతరావుకి పసివాడి విషయం కన్నా, భార్య విషయం ముఖ్యమనిపించింది ఆమెని ఒళ్లోకి తీసుకుంటూ అన్నాడు చ ఛ, చిటికెలో జ్వరం తగ్గిపోతుందన్నాడు డాక్టరు పొద్దున్నే మళ్ళీ వస్తానన్నాడు, అదీ దానర్థం మనబాబు హాయిగా లేచి తిరుగుతాడు తెల్లారగానే గతంలాగే బవిష్యత్తు కూడా ఉంటుందనుకోవటం, భగవంతుణ్ణి అవమానించటమే తెలుసా? ఒక రకంగా అది పాపం కూడా! కావాలని మళ్ళీ పాపం చెయ్యకూడదు కదా! నా మాట నమ్ము! హాయిగా తెల్లారుతుంది! పడుకో నేనూ, బాబాయిగారూ మేల్కొని ఉంటాంలే!

రాత్రి రెండు గంటలకి ఉద్దండుకి జ్వరం తగ్గుముఖం పట్టింది పేలాపనలు వచ్చినవి వచ్చినట్టే పోయాయి అదే సమయానికి బలానికి మందేసుకొంటూ మత్తు బిళ్ల ఒకటి బార్య చేత మింగించాడు ధీమంతరావు పిల్లాడితో బాటు తల్లి కూడా నిద్రలోకి జారుకుంది

తెల్లారి నిద్ర మెలకువ వస్తూనే శకుంతల పిల్లాణ్ణి దగ్గరికి తీసుకుంది వాడు కళ్ళు తెరిచి మంచి నీళ్ళు అన్నాడు శకుంతల మనస్సు కుదుట పడింది

డాక్టరొచ్చి చూసాడు ఏం బయం లేదు పిల్లాడి మనస్సు గాయపడిందేమోనని నా అనుమానం ఇహనుంచీ జాగ్రత్త పడండి అని బిళ్లలు రాసిచ్చి వెళ్ళిపోయాడు

*             *             *

నాలుగు మెతుకులు తినొచ్చి పిల్లాడి పక్క కూర్చున్నారు దంపతులు ధీమంతరావన్నాడు

గత రెణ్ణెల్లుగా నా క్యాపుల గోల్లో పడి పిల్లాడి మనస్సు బహుముఖంగా ఎట్లా ఎదుగుతోందో గమనించని పొరబాటు నాది! నాకు చెప్పని పొరబాటు నీది! పోన్లే ఇప్పుడయినా జరిగినవన్ని వివరంగా చెప్పావు నువ్వు చెప్పిన వాటిని బట్టి నువ్వెప్పుడూ వాడికి, అది చెయ్యొద్దు ఇది ముట్టుకోవద్దు, అది తప్పు, ఇది పాపం – అనే నిషేదాలే చెప్పావని అర్థమవుతోంది అవునా? ఇకనుంచీ ఈ రకమైన నిషేదాల పెంపకం – నెగెటివ్ బ్రింగప్ – మానెయ్యాలి మనం ఏది ఒప్పో ఏది మంచో, ఏది ఎక్కువ ఆనందమో అది మనమేచేసి వాడికి చూపించాలి వాడిచేతికి ఎప్పుడూ ఏదో పని కల్పించాలి వాడేదయినా తప్పుపని చేస్తుంటే దాన్ని మొత్తంగా ఆపించే ప్రయత్నం మనం చెయ్యకుండా అల్లాకాదు నానా ఇల్లా అని వాణ్ణి మళ్లించాలి ఇట్లా మళ్లించటానికి వీలుగా ఉండే కార్యక్రమాల్ని అవసరమనుకుంటే లిస్టు రాసుకో ఈ కాలెండరు మీద ఇదంతా తేలికని నేనను కాని కొంతకాలం శ్రమపడి ఈ రకమైన పెంపకం అలవాటు చేసుకుంటే ఆపైన వాడివలన మనకి నిత్యమూ ఇంట్లో పున్నమి వెన్నెలే! నీ ఆరోగ్యం కూడా మెరుగవుతుంది! ఈ అయిడియా నాకెల్లా వచ్చిందో తెలుసా?

చెప్పండి! అంది శకుంతల

నేను చెప్పటమేంటి, వాడే చెప్పుకున్నాడు సన్నాసి నేనేం చెయ్యనే, చెప్పవే, అమ్మా! అని రాత్రివాడు అదే పనిగా కలవరించాడు గమనించలేదా? అంటే అది వాడి గుండెలోతుల్లో ఉన్న క్షోభన్నమాట! ఇంత ఆగడం జరిగితేనేగాని. తన ఆవేదన్ని బయటికి చెప్పుకోలేక పోయాడు పిచ్చి పిల్లడు! ఇట్లా చేద్దామంటావా?

"ఇంకా అనుమానం కూడానా! మీ రెట్లా అంటే అట్లాగ! నాకు బాబో కన్నూ, మీరో కన్నూ నండి! – నిద్రపోతున్న ఉద్దండుని తల ఒళ్లోకి తీసుకుని, తన తలని భర్త ఒళ్లో పెట్టింది శకుంతల ఆఖరు సారిగా తన ఆవేదన్ని ఏడుపు రూపంలో భళ్ళున కక్కేసింది □